క్లుప్తంగా

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 407/2లో 71 గుంటల సీలింగ్ భూమిలో గురువారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ నెల 18న సాక్షిలో ప్రచురితమైన యథేచ్ఛగా భూ కబ్జా కథనానికి తహసీల్దార్ రాజేశ్వరి స్పందించారు. భూమిని అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ కమలేశ్, సర్వేయర్ కరుణాకర్ పలువురు పాల్గొన్నారు.

అధిక దోపిడీ అడ్డుకుంటాం

హుజూరాబాద్: ప్రైవేటు విద్యా సంస్థల్లో అధిక దోపిడీని అడ్డుకుంటామని విద్యార్థి యువజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో విద్యార్థి సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. విద్యను వ్యాపారం చేస్తూ పాఠశాల ఆవరణలో అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారని, అధికారులు స్పందించకుంటే అఖిలపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శ్రావణ్, సూర్యకిరణ్,పర్లపల్లి నాగరాజు, కర్ర శ్రీధర్‌రెడ్డి,పంజాల రేవంత్,గండు ప్రశాంత్ యాదవ్,ఆలేటి శ్రీరామ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏఐవైఎఫ్ పోరాటం



చిగురుమామిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బామండ్లపల్లి యుగేందర్ అన్నారు. గురువారం చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారక భవనంలో ఏఐవైఎఫ్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐవైఎఫ్ పనిచేస్తుందని, రాజీవ్ యువవికాస పథకం అర్హులకు మాత్రమే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ జిల్లాకు ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోయారని, రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ అమలు పర్చడంలో విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు చెంచల రవి, పి వెంకటేశ్, లక్కిరెడ్డి సురేందర్‌రెడ్డి, చెప్యాల శ్రీనివాస్, పైడిపెల్లి శివకుమార్, సీహెచ్ హరీశ్, చారి, రాజు, తిరుపతి, శ్రీశైలం, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ఇల్లందకుంట: ప్రాథమికవిద్యను బలోపేతంచేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రాథమిక విద్య బలోపేతం చేస్తే సెకండరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు సార్ల సంపత్ మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు, డీఏలను ఇవ్వాలని, పీఆర్సీని వెంటనే అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జోన్ కన్వీనర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.వేణు, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, సత్యం, శంకర్, గోపి, రాధికారాణి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి, ధర్మరాజుపల్లి, కందుగుల, చెల్పూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను గురువారం ఏడీఏ సునీత తనిఖీ చేశారు. షాపుల నిర్వాహకులతో వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎరువుల విత్తనాలు, పురుగుమందు నిల్వలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. డీలర్లు కాలం చెల్లిన విత్తనాలు, పురుగుమందు, నిషేధిత మందులు అమ్మకూడదని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహిస్తూ స్టాక్ రిజిస్టర్లను రోజువారీగా రాయాలన్నారు. అధీకృత లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయొద్దని, రెన్యువల్ చేయించుకోవడానికి ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని, విత్తన, ఎరువులు, క్రిమిసంహారక మందులకు స్టాక్ బోర్డులు విడివిడిగా ఏర్పాటు చేసి ప్రదర్శించాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, ఎమ్మార్పీకి మించి విక్రయించొదన్నారు. వెంట ఏవో చాడ భూమిరెడ్డి, తదితరులున్నారు.

చెరువును కాపాడేదెవరు...?



ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి గ్రామ పెద్దచెరువు కింద 200 ఎకరాల సాగుభూమి ఉంది. కొందరు జేసీబీలతో మట్టిని తరలిస్తూ భూమిన్తి పొలాలుగా మారుస్తున్నారు. సగం చెరువు కబ్జాకు గురికావడంతో ఒక్క పంట పండించుకోలేని పరిస్థితి నెలకొందని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువుపై ఆధారపడిన మత్స్యకారులు జీవనోపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకు హద్దులు గుర్తించి చుట్టూ కందకం తవ్వకాలు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి



ఇల్లందకుంట: రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని పూడ్చడంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనివల్ల వాహనదారులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులుపడుతున్నారు. పాఠశాల పక్కనే ఉడటంతో విద్యార్థులకు ప్రమాదం పొంది ఉంది. సమస్యను పరిష్కరించడానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలుమార్లు గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా స్పందన కరువైందని, గొయ్యి మరమ్మతుకు జీపీ నిధులు లేవంటూ కార్యదర్శి నిర్లక్ష్య సమాధానం చెబుతున్నాడని, గొయ్యిని పూడ్చి ప్రమాదాల బారినుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డీలర్ల నియామకానికి కసరత్తు

- 68 దుకాణాలకు 328 మంది ఎంపిక
- జూలై 1 నుంచి 3వరకు ఇంటర్వ్యూలు
- మొదలైన రాజకీయ పైరవీలు



నోటీస్ బోర్డుపై పరీక్ష ఫలితాలు

కరీంనగర్ అర్బన్: నూతన రేషన్ దుకాణాలకు డీలర్ల నియామక ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. డీలర్ల నియామకానికి గత ఏప్రిల్ 24న పరీక్ష నిర్వహించగా మేలో ఇంటర్వ్యూ నిర్వహించాల్సి ఉండగా పలు అనివార్య కారణాల వల్ల జాప్యమేర్పడింది. 68 దుకాణాలకు నోటిఫికేషన్ రాగా 600లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈక్రమంలో పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారిని ఒక్కో దుకాణానికి 1:5 చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. సదరు జాబితాలను ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో అంటించారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో కరీంనగర్ అర్బన్‌లో 10 రేషన్ దుకాణాలు, కరీంనగర్ రూరల్ మండలంలో 7, గంగాధర 6, మానకొండూరు 9, చొప్పదండి 8, రామడుగు 6, తిమ్మాపూర్ 8, చిగురుమామిడి 5 గన్నేరువరం 7, కొత్తపల్లి 2 రేషన్ దుకాణాలు ఖాళీలున్న విషయం తెలిసిందే. కాగా ఎంపికైన వారికి జూలై ఒకటి నుంచి 3 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆర్డీవో కుందారపు మహేశ్వర్ వివరించారు. దశాబ్దాల తర్వాత రేషన్ దుకాణ డీలర్ నియామకానికి ప్రకటన వెలువడటంతో పోటాపోటీగా దరఖాస్తులు వచ్చాయి.

రాజకీయ పైరవీలు షురూ..

రేషన్ దుకాణ డీలరు పోస్టుకు పోటీ నెలకొనడంతో పలు ప్రాంతాల్లో ఎవరికి వారుగా పైరవీలు మొదలెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతల్లో కొందరు అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో డీలర్ పోస్టుకు ఐదుగురిని ఇంటర్వ్యూకు ఎంపిక చేయగా మిగతా అభ్యర్థులను డ్రాప్ కావాలని బేరసారాలు కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. కరీంనగర్ రూరల్, గంగాధర, కరీంనగర్ అర్బన్, తిమ్మాపూర్, మానకొండూరు, గన్నేరువరం మండలాల్లోని పలు ఖాళీలకు ఇప్పటికే ఒప్పందం జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు ఇప్పటికే రంగంలో దిగగా తమ పలుకుబడితో డీలర్ ఇప్పిస్తామని, అవసరమైతే ప్రభుత్వ పెద్దలతో చెప్పిస్తామంటూ మాటల గారడీ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే రేషన్ డీలర్ల ఎంపిక అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎలాంటి పైరవీలకు అస్కారం లేదని ఆర్డీవో మహేశ్వర్ స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని, కలుషిత నీరు, కుళ్లిన ఆహారాలు తినొద్దని చెల్పూర్ పీహెచ్‌సీ డాక్టర్ మధు సూచించారు. అనంతరం ఎంపీడీవో ఆఫీసులో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాన్ని వైద్య సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీవో సునీత, తహసీల్దార్ కనుకయ్య, వైద్యురాలు జరీనా, ఎంఈవో భూపతి శ్రీనివాస్‌లున్నారు.

ఇల్లందకుంట: సీజనల్ వ్యాధులపై మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు గురువారం సైన్స్ టీచర్లు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పిల్లలకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, మెడికల్ ఆఫీసర్ తులసీదాస్, ఎంఈఓ రాములు నాయక్, ఎంపీఓ రాజేశ్వర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ రోజ, సీహెచ్‌వో శ్యామల, విజయశ్రీ, శ్రీనివాసరావు, అజీజ్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

జమ్మికుంటరూరల్: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ పరిధి అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రంలో గురువారం డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలని, ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ సదానందం, ప్రధానోపాధ్యాయుడు రాజు, ఏఎన్ఎం రమ, అంగన్‌వాడీ టీచర్ హజరత్, ఉపాధ్యాయులు శిరీష, ఆశాకార్యకర్త మణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో గురువారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్‌కు షుగర్, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు సంపత్, గోవర్దన్, మతిన్, శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్ పాల్గొన్నారు.

మేమెవ్వరికి డబ్బులు ఇయ్యలే



నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

శంకరపట్నం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చుట్టూ తిరిగినా ఇళ్లు మంజూరు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని మండలంలోని లబ్ధిదారులు స్పష్టం చేశారు. ఇళ్ల కోసం కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేశారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించడం సరికాదని గురువారం ఇళ్లు మంజూరైన సుమారు వందమంది లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని కాంగ్రెస్ హామీలు అమలుచేస్తుందన్నారు. పదేళ్లపాలనలో పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. డబ్బులు ఇచ్చినట్లు నిరూపిస్తే లబ్ధిదారుల చెప్పులు మెడలో వేసుకుంటానని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి తిరుపతి, మహిళా అధ్యక్షురాలు పద్మ, యూత్ అధ్యక్షుడు అజయ్, మాజీ సర్పంచులు పద్మ, సదానందం, రాజకొంరయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలో శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు పర్యటనకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు, హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్, డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా నాయకురాలు భారతీదేవి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు లచ్చిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



యశ్వికతో ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్



విద్యార్థిని అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: నిజామాబాద్‌లో ఈనెల 28 నుంచి జరగనున్న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొత్తపల్లిని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో జరిగిన అంతర్ జిల్లా బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.రిషిరెడ్డి, జి.హేమంత్‌జాదవ్‌లు సబ్ జూనియర్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అభినందించారు. ప్రిన్సిపాల్, పీఈటీలు పాల్గొన్నారు.

సెయింట్ జార్జ్ విద్యార్థి..

నిజామాబాద్‌లో ఈనెల 28 నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో నిర్వహించిన అంతర్ జిల్లా బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్.కార్తికేయ యాదవ్ ప్రతిభకనబర్చి ఎంపికయ్యారని అన్నారు. గురువారం కార్తికేయ యాదవ్‌ను ఫుట్‌బాల్ కోచ్ రవికుమార్ అభినందించారు. ప్రిన్సిపాల్ ప్రియదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్..

కరీంనగర్‌రూరల్: బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆకుల యశ్విక్ ఈనెల 28 నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ సుంకరి మురళీధర్ తెలిపారు. గురువారం యశ్విక్‌ను ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, కోచ్ సాయికిరణ్, పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డిలు అభినందించారు.



అక్షరను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

దక్షిణాసియా సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఐ.అక్షర దక్షిణాసియా సాఫ్ట్‌బాల్ పోటీలకు భారతదేశ తరుపున ఎంపికైనట్లు పీడీ పర్వీనాబేగం తెలిపారు. సాఫ్ట్‌బాల్ గేమ్స్ 2024–25లో భాగంగా జూలై 17నుంచి 22వరకు నేపాల్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. అక్షరను గురువారం ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

• కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదు

హుజూరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో నాయకుడు కొప్పుల శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇరాన్, ఇజ్రాయిల్ చేస్తున్న ఏకపక్ష దాడులను ప్రధాని మోదీ ఖండించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు బాంబు దాడులకు పాల్పడుతున్నా మోదీ మౌనం ఎందుకు వహిస్తున్నారని, మోదీ ప్రభుత్వం అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతుందని, మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

• విద్యార్థుల ప్రతిభా అభినందనీయం

జమ్మికుంట: విద్యార్థులు రీసైక్లింగ్ వస్తువులు తయారుచేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. ఆరుబయట చెత్త పడవేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, విద్యార్థులు చెత్తను రీసైక్లింగ్ చేసి చూపించారని, 45 మంది విద్యార్థులు చెత్తతో వివిధ వస్తువులు తయారు చేయగా ప్రతిభ కనబరిచిన ముగ్గురికి స్కూల్ బ్యాగులు, మిగతా వారికి పెన్నులను బహూకరించారు. పాత వ్యవసాయ మార్కెట్ ఏరియాలో చెత్తను శుభ్రం అక్కడ గ్యారేజ్ పాయింట్ ఏర్పాటు చేసి చెత్త వేయొద్దని ముగ్గులు వేసి ప్రజలకు తెలియజేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

•చెత్తాచెదారం తొలగింపు

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ వరదకాలువలో నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీలోని చెత్తాచెదారం తొలగించారు. వర్షాకాలంలో కాలనీకి వరదముప్పు రాకుండా మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ అధికారులను కలిసి పనులు చేయించాలని కోరగా పనులు వేగంగా జరుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు.

• స్కూల్ బ్యాగులు పంపిణీ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన ఉదారం శ్రీనివాస్ తన కూతురు మాన్విత జ్ఞాపకార్థం స్కూలు బ్యాగులు విద్యా సామగ్రి అందిస్తున్నారు. హెచ్ఎం వీరేశం శ్రీనివాస్‌ను అభినందించారు.

• ఇద్దరికి తీవ్ర గాయాలు

వీణవంక: మండల కేంద్రంలోని అంకూస్‌పల్లికి వెళ్లే దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బేతిగల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోరె సారయ్య, మాజీ వార్డు సభ్యుడు శ్రీరాం సంపత్ బైక్‌పై వీణవంకకు వస్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బొలేరో వాహనాన్ని అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

• ముగ్గురిపై కేసు

వీణవంక: బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సంగె ప్రతాప్ తన పొలం పక్కన ఉన్న కుంటలో నుంచి మట్టి తీస్తుండగా డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. కనపర్తి గ్రామానికి చెందిన ముగ్గురు రూ.ఐదువేలు ఇవ్వాలని లేదంటే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని బెదిరించారని, ముగ్గురిలో ఒకరు పత్రికా విలేకరని, బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సమస్యలు పరిష్కరించండి



టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌తో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: పేరుకు ప్రభుత్వ ఉద్యోగులే తప్పా అన్ని సమస్యలేనని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో జిల్లా సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, గూడ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్, తదితరులు

జమ్మికుంట: మేదరి విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కరీంనగర్ జిల్లా మేదరి సంఘం అధ్యక్షుడు మధిర రవీందర్ అన్నారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. అట్టడుగున ఉన్న మేదరి కులస్తులకు స్ఫూర్తినిచ్చే విధంగా, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రతిభా పురస్కారాలను జిల్లా కేంద్రంలోని రేకుర్తి సంఘం భవనంలో మేదరి ఉద్యోగల సంఘం, నగర మేదరి సంఘం ఆధ్వర్యంలో 29న అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉద్యోగాలు సాధించినవారు, ఉద్యోగ, పదవి విరమణ పొందిన వారికి సన్మానం ఉంటుందని, మేదరి కుల బాంధవులు, మేధావులు, యువత, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలపరెడ్డి లచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకుల రాజనర్సు, ఏకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం



గన్నేరువరం: బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, సీపీ

గన్నేరువరం: యువతపై డ్రగ్స్ ప్రభావం అనే అంశంపై మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మానస, వైశాలి, అక్షితలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజ్ఞాన్ కాన్వెంట్ పాఠశాలలో చిత్రలేఖన పోటీలను నిర్వహించగా కావ్య, అక్షిత ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గురువారం కరీంనగర్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు విద్యార్థులకు అందజేశారు. మండల విద్యాధికారి రామయ్య, ఎస్సై నరేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బూర భానుచైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామడుగు: జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో గోపాల్‌రావుపేట అక్షర స్కూల్ విద్యార్థి పొన్నం లాస్య మొదటి బహుమతిని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం చేతుల మీదుగా అందుకుందని స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ఆర్. స్రవంతి, డిబేట్ కాంపిటేషన్‌లో ఆశ్విత, శరణ్యలు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతులు అందుకున్నారని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణ పరిధి, మండలంలోని చెల్పూర్‌లో యువత డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్న తరుణంలో సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు సీఐ కరుణాకర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో లక్ష్మీప్రసన్న, గట్టు హరిణి, శృతి అత్యుత్తమ ప్రతిభ కనబరచగా సీఐ ప్రశంసాపత్రాలను అందజేశారు.

చొప్పదండి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చొప్పదండి పోలీసులు పట్టణంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, యువకులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చొప్పదండి ఎస్ఐ నరేశ్‌రెడ్డి మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.

శంకరపట్నం: మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులు, యువతకు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాఠశాల నుంచి బస్టాండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాల కలిగే అనర్థాలను ఆటపాటల ద్వారా వివరించారు.ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, అధ్యాపకులు సురేందర్, కానిస్టేబుళ్లు అరవింద్, రఘురాం, రాజన్ అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, విద్యార్థినులు

కొత్తపల్లి: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, టాస్క్ తెలంగాణ, సివిల్ ఫోర్స్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ సంకల్ప్‌లో భాగంగా కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల చైర్మన్ వి.రవీందర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బి.మధుసూదన్ రెడ్డిలు డ్రగ్స్ అనర్థాలు, నాశనమవుతున్నవారి జీవితాల గురించి వివరించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమాజంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. టాస్క్ డిస్ట్రిక్ట్ రీజినల్ కోఆర్డినేటర్ గంగా ప్రసాద్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజాపల్లె సబ్‌స్టేషన్‌లో నూతన లైన్ ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లె గ్రామం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఇంటర్ లింకు సిస్టం 33/11 కేవీ లైన్‌ను గురువారం ఎస్ఈ మేక రమేశ్ ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి నూతన లైన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ ఉపేందర్, ఆపరేషన్ డీఈ లక్ష్మారెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ చంద్రమౌళి, జమ్మికుంట ఏడీఈ రాజేందర, రూరల్ ఏఈ జనార్దన్, విద్యుత్ అధికారులు రవీందర సంతోశ్, ఐలేశ్, కనకయ్య తదితరులున్నారు.